

లేతజొన్న తిని 34 గొర్రెలు మృతి

లోకేశ్వరంలో లేత జొన్నకర్రలు తిని 34 గొర్రెలు మృతి చెందాయి. ఇద్దరు రైతులకు రూ.4 లక్షల నష్టం జరిగింది. 8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
మంగళ:6:28	బుధ: 4:58

గరిష్ఠం/కనిష్ఠం
37.4 /21.5

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం కొంతమేర మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వేడి, ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

మల్లన్న కల్యాణం



బోనాలతో ఆలయానికి వస్తున్న మహిళలు

కడెం: మండలంలోని పెద్దూర్‌కు చెందిన శ్రీకృష్ణ యాదవసంఘం ఆధ్వర్యంలో సోమవారం మల్లన్న పట్నాల ఉత్సవాలు నిర్వహించారు. ఒగ్గు కళాకారుల ఆట, పాటలు, డప్పుల, చప్పులతో నెత్తిన బోనాలతో మహిళలు ఆలయానికి చేరుకుని, నైవేద్యాలు సమర్పించారు. మొక్కులు చెల్లించుకున్నారు. పట్నాల అనంతరం మల్లికార్జునస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. పెద్దగొల్ల గజ్జి ఈజన్న, యాదవ సంఘం అధ్యక్షుడు సంఘ పోశన్న, కార్యదర్శి జక్కుల మల్లేశ్, క్యాషియర్ వెంకటేశ్, చిన్నగంగన్న, తోట్ల క్రాంతి, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

24న ఖానాపూర్‌లో హోలీ

ఖానాపూర్: హోలీ పండుగను ఖానాపూర్‌లో ఈనెల 24న పురోహితుల సూచన మేరకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, హిందు ఉత్సవ సమితి నాయకులు తెలిపారు. హిందు ఉత్సవసమితి వ్యవస్థాపకుడు వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు సురేశ్‌తోపాటు వీడీసీ నాయకులతో కలిసి వెంకటేశ్వర ఆలయ అర్చకులు నర్సింహమూర్తిని సోమవారం కలిశారు. ఈ సందర్భంగా పురోహితుల సూచన మేరకు 23న కామదహనం, 24న హోలీ నిర్వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కావలి సంతోష్, కిశోర్ నాయక్, శ్యామ్‌మోహన్‌రావు, శ్రీనివాసకృష్ణ స్వామి, బీసీ రాజన్న, సతీశ్‌రావు, రమేశ్, రాజు, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

1,087 ఎకరాల్లో పంట నష్టం



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

లక్ష్మణచాంద: మండలంలో శనివారం రాత్రి కురిసిన వడగళ్ల వానకు 1,087 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశామని ఏవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మొక్కజొన్న, వరి, నువ్వు పంటలు దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు. మండలంలోని చింతల్‌చాంద, చామన్‌పెల్లి, మునిపెల్లి, పీచర, ధర్మారం, లక్ష్మణచాంద గ్రామాల్లో ఏఈవోలు ఉమామహేశ్వరి, పవిత్రతో కలిసి పర్యటించారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. మండల వ్యాప్తంగా వరి పంట 120 ఎకరాల్లో, మొక్కజొన్న 308 ఎకరాల్లో, నువ్వు 659 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా గుర్తించామని వివరించారు. మొత్త 631 మంది రైతులకు నష్టం జరిగినట్లు పేర్కొన్నారు. ఈమేరకు ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. ప్రభుత్వం నుంచి వచ్చే సూచనకు అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.



ఈ ఫొటోలోని రైతుపేరు మామిడి ముత్యంరెడ్డి. లోకేశ్వరం మండలం పంచగుడి గ్రామానికి చెందిన ముత్యంరెడ్డి ధర్మోర శివారులో తనకున్న నాలుగు ఎకరాల్లో యాసంగిలో వరి సాగుచేశాడు. బోరు కిందనే పంట సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో వారం రోజులుగా బోరులో నీళ్ల లేక మోటార్ సన్నాగా వస్తోంది. ఇప్పటికే ఎకరాకు రూ.20 వేల చొప్పున రూ.80 వేలు ఖర్చు చేశాడు. ఇప్పటికే సగం వరి పంట ఎండిపోయే దశకు చేరింది. కళ్ల ముందే ఎండుతున్న పంటను చూసి దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు.



ఈ ఫొటోలో పశువులు మేస్తున్న వరి పంట లోకేశ్వరం మండలం మొహాళకు చెందిన భోజన్నది. మూడెకరాల్లో యాసంగిలో వరి సాగు చేశాడు. పూర్తిగా బోరు ఆధారంగా పంట వేశాడు. అయితే ఎండలకు భూగర్భ జలాలు వేగంగా పడిపోతుండడంతో బోరు సరిగా పోయడం లేదు. దీంతో మూడెకరాలకు నీరందడం లేదు. కళ్ల ముందే ఎండుతున్న పంటను కాపాడుకునేందుకు 350 ఫీట్ల బోరు వేయించాడు. అయినా చుక్క నీరు పడలేదు. మరోవైపు ఇప్పటికే సగం పంట ఎండిపోయింది. దీంతో ఎండిన పంటను ఇలా పశువులకు వదిలేశాడు.

పాతాళంలో గంగ.. పంటలపై బెంగ

- జిల్లాలో వేగంగా పడిపోతున్న భూగర్భ జలాలు
- వట్టిపోతున్న బావులు, బోర్లు
- పంటలను కాపాడుకునేందుకు రైతుల తిప్పలు
- కళ్ల ముందే ఎండుతున్న పంటలతో రైతుల్లో ఆందోళన



ధర్మోరలో ఎండిపోతున్న వరి పొలం

మూడు నెలలుగా భూగర్భ జలాలు ఇలా(మీటర్లలో..)	
జనవరి	6.50
ఫిబ్రవరి	7.87
మార్చి	9.11

మండలాల వారీగా ప్రస్తుతం భూగర్భ జలమట్టం(మీటర్లలో)..	
దిలావర్‌పూర్	6.51
కడెం	3.13
లక్ష్మణచాంద	1.38
లోకేశ్వరం	8.90
మామడ	6.41
ముథోల్	7.30
నర్సాపూర్‌జీ	7.81
నిర్మల్	3.25
పెంబి	3.39
సారంగాపూర్	10.58
తానూరు	8.10
బాసర	7.00
భైంసా	5.80
దస్తురాబాద్	4.10
కుంటాల	10.89
కుభీర్	5.90
సోన్	1.35
ఖానాపూర్	7.55

లోకేశ్వరం: జిల్లాలో కరువు తరుముకొస్తోంది. ఆరు నెలలుగా వరుణుడు ముఖం చాటేయడం, మార్చిలోనే భానుడు భగ్గుమంటుండడంతో చెరువులు, కుంటలు, వాగులు ఎండిపోతున్నాయి. ఫలితంగా జిల్లాలో భూగర్భ జలాలు వేగంగా పడిపోతున్నాయి. దీంతో బోర్లు, బావులను నమ్ముకుని యాసంగిలో పంటలు సాగుచేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వేల రూపాయలు పెట్టుబడి పెట్టారు. ప్రస్తుతం పొట్ట దశలో ఉన్న పంటలు కళ్ల ముందే ఎండిపోతుండడంతో ఎలా కాపాడుకోవాలో తెలియక కన్నీటిపర్యంతమవుతున్నారు. వానాకాలంలో వరదలు, తెగుళ్లతో పంట నష్టపోయిన రైతులు యాసంగిలో ఆ నష్టాన్ని పూడ్చుకుందామనుకున్నారు. కానీ ప్రతికూల వాతావరణ పరిస్థితులతో పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. సగం పంటను అయినా కాపాడుకుందామని రైతులు అష్టకష్టాలు పడుతున్నారు.

యాసంగి పంటల సాగు ఇలా..

వ్యవసాయ ఆధారంగా ఉన్న జిల్లాలో నీటి కొరత కారణంగా యాసంగి పంటల సాగు బాగా తగ్గిపోయింది. 80 వేల ఎకరాల్లో వరి, లక్ష ఎకరాల్లో మొక్కజొన్న, 2,500 ఎకరాల్లో నువ్వు, 1,700 ఎకరాల్లో జొన్న పంట సాగుచేశారు. ఆగస్టు తర్వాత జిల్లాలో వర్షాలు కురవకపోవడంతో యాసంగిలో ఆరుతడి పంటలకే రైతులు ఎక్కువగా మొగ్గు చూపారు. వరి విస్తీర్ణం 80 వేల ఎకరాలకే పరిమితమైంది. ఇక యాసంగి ప్రారంభంలో వరి పంటను తెగుళ్లు ఆశించాయి. దీంతో రసాయన మందులు పిచికారీ చేసిన రైతుల పెట్టుబడి పెరిగింది. ఎన్నో కష్టాలు పడి పంటను కాపాడుకుంటూ వచ్చారు. ప్రస్తుతం వరి పొట్టదశలో ఉంది. ఈ తరుణలో నీరు చాలా ముఖ్యం. కానీ ఇదే సమయంలో నీరు అందకపోవడంతో గింజలు తాలుగా మారుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు.

బావుల్లో పూడిక తీత, కొత్త బోర్ల తవ్వకం..

కళ్ల ముందే పంట ఎండిపోయే దశలో ఉండడంతో రైతులు బావుల్లో పూడిక తీయిస్తున్నారు. కొత్తగా బోర్లు వేయిస్తున్నారు. దీంతో రైతులపై మరింత ఆర్థికభారం పడుతోంది. ఇప్పటికే చాలా మంది బావుల్లో పూడికతీత పనులు చేపట్టారు. బోర్లు వట్టిపోయిన రైతులు కొత్త బోర్లు వేయించేందుకు డబ్బులు సమకూర్చుకుంటున్నారు. ఇందుకోసం అప్పులు చేస్తున్నారు.

భారీగా పడిపోయిన భూగర్భ జలం..

వానాకాలంలో కురిసిన వర్షాలకు జిల్లా వ్యాప్తంగా భూగర్భజలాలు అనూహ్యంగా పెరిగాయి. తర్వాత వానలు లేకపోవడం, వేసవి ప్రారంభంలోనే ఎండలు మండుతుండడంతో భూగర్భ జలాలు వేగంగా పడిపోతున్నాయి. జనవరిలో 6.50 మీటర్లలోతులో ఉన్న భూగర్భ జలాలు ఫిబ్రవరిలో 7.87కు పడిపోయాయి. మార్చిలో 9.11కు పడిపోయాయి. ఏప్రిల్‌లో 11 మీటర్ల లోతుకు చేరే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే 250 ఫీట్లకుపైగా బోర్లు వేసినా నీళ్లు పడడం లేదని రైతులు చెబుతున్నారు.



కడెం మండలంలో బావిలో పూడిక తీయిస్తున్న రైతు

పంటలు ఎండిపోతున్నాయి



ఎండల తీవ్రతకు పంటలు ఎండిపోతున్నాయి. పంటలను కాపడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నం. ఇంత కష్టపడుతున్నా చివరికి పంట చేతికి వస్తుందో రాదో తెలియని పరిస్థితి. ఇప్పటికే ఎకరాకు రూ.20 వేలకుపైగా పెట్టుబడి పెట్టాం.

– లక్ష్మణ్, లోకేశ్వరం

మొక్కజొన్న ఎండిపోయింది..



ఈసారి వర్షాలు తక్కువగా కురవడంతో యాసంగిలో వరికి బదులు 8 ఎకరాల్లో మొక్కజొన్న వేశాను. 2 ఎకరాల్లో కర్బూజా, టమాటా, బీర, కాకర పంటలు సాగు చేస్తున్నా. ఎండలు పెరిగాయి. భూగర్భ జలాలు తగ్గాయి. దీంతో మొక్కజొన్న పంట నీరందక ఎండిపోయింది.

– ఓడ్పం రాజు, గడ్‌చాంద

భూగర్భ జాలాలు పడిపోతున్నాయి..

గతేడాది జూన్, జూలై, ఆగస్టు నెలల్లో వర్షాలు కురిశాయి. తర్వాత చినుకు పడలేదు. దీంతో జలాశయాల్లో నీరు ఇంకిపోతోంది. పెరుగుతున్న ఎండలకు భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. అందుకే బోర్లు, బావులు ఎత్తిపోతున్నాయి.

– శ్రీనివాస్, జిల్లా భూగర్భజల శాఖ అధికారి

పల్లెలు పచ్చదనంతో కళకళలాడాలి

- అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



గోదాంను పరిశీలిస్తున్న ఫైజాన్ అహ్మద్

కుంటాల: హరితహారం కార్యక్రమంలో నాటిన మొక్కలతో పల్లెలన్నీ పచ్చదనంతో కళకళలాడాలని అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. మండలంలోని అందకూర్‌లోని నర్సరీని సోమవారం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వేసవి దృష్ట్యా నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రూ.40 లక్షల రూర్బన్ నిధులతో నిర్మించిన వ్యవసాయ గోదాంను పరిశీలించారు. ఈ గోదాంలో వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ ఉంచుకోవడం వల్ల రైతులకు మేలు జరుగుతుందన్నారు. వారి వెంట ఏపీవో గట్టుపల్లి నవీన్, పంచాయతీ కార్యదర్శి రమ్య, టీఏ శశిందర్‌రావు, ఎఫ్ఏ భోజన్న ఉన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నికల సందడి



నామినేషన్లు వేస్తున్న న్యాయవాదులు

నిర్మల్‌టౌన్: నిర్మల్ న్యాయవాదులకు సంబంధించిన బార్ అసోసియేషన్ ఎన్నికల ప్రక్రియ మొదలైందని ఎన్నికల అధికారులు షేర్ నరేందర్, కొమ్మోజి రమణ తెలిపారు. జిల్లా కేంద్రంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం నామినేషన్లు స్వీకరించారు. అధ్యక్ష పదవికి ఒక్క నామినేషన్, ప్రధాన కార్యదర్శి పదవికి రెండు, ఉపాధ్యక్షుడు, ట్రెజరీ పోస్టుకు ఒక్కోటి, జాయింట్ సెక్రెటరీ, గేమ్స్ అండ్ కల్చరల్ పదవులకు ఒక్కోటి, లైబ్రరీ పోస్టుకు ఒక నామినేషన్లు వచ్చాయని వివరించారు. ఈనెల 20వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణకు సమయం ఉందని తెలిపారు. 22 వరకు ఉపసంహరణ, 28న ఎన్నికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అదేరోజు సాయంత్రం ఫలితాలు ప్రకటిస్తామని వెల్లడించారు.

లైసెన్స్‌డు ఆయుధాలు అప్పగించాలి

నిర్మల్‌చైన్‌గేట్: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున జిల్లాలో లైసెన్స్‌డు ఆయుధాలు ఉన్నవారు వాటిని సమీప పోలీస్ స్టేషన్లలో అప్పగించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. సెక్షన్ 144 క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ ప్రకారం ఎన్నికల సమయంలో ఆయుధాలు ఉండడం నేరమని తెలిపారు. లైసెన్స్ ఉన్నప్పటికీ పోలీస్ స్టేషన్లలో అప్పగించాలని పేర్కొన్నారు. ఈమేరకు ఎస్పీ జానకి షర్మిల సంబంధిత పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారని వెల్లడించారు.

ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: ఎన్నికల సంఘం నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంసీసీ, సర్వేలెన్స్, ఫ్లైయింగ్ స్క్వాడ్, వీడియో సర్వేలెన్స్ బృందాలకు సోమవారం శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు జిల్లాలో ఎంసీసీ, సర్వేలెన్స్ బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, వీడియో సర్వేలెన్స్ బృందాలు సమర్థవంతంగా విధులు నిర్వహించాలన్నారు. సువిధ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకునే రాజకీయ పార్టీలకు, నాయకులకు, అభ్యర్థులకు సంబంధించి వాహనాలు, ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు అనుమతులు అందించాలన్నారు. సి-విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులను 100 నిమిషాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయ పార్టీలకు సంబంధించిన వాల్ రైటింగ్, ఫ్లెక్సీలు, హోర్డింగులు, ఫొటోలను ప్రభుత్వ కార్యాలయాల్లో, బస్‌స్టాండ్, రైల్వే స్టేషన్ పెట్రోల్ బంక్ తదితర పబ్లిక్ ప్రదేశాలలో, అనుమతి లేని ప్రైవేట్ స్థలాల్లో పూర్తి స్థాయిలో తొలగించాలన్నారు. కరపత్రాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు ముద్రించే సమయంలో ప్రింటింగ్ ప్రెస్ పేరు, ఫోన్ నంబర్, అలాగే పబ్లిషర్ పేరు, వారి ఫోన్ నంబర్ తప్పనిసరిగా పేర్కొనాలని సూచించారు. ఈ అంశాన్ని అన్ని ప్రింటింగ్ ప్రెస్ యజమానులు పాటించాల్సి ఉంటుందని తెలిపారు. చెక్ పోస్టుల వద్ద ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని పేర్కొన్నారు. మద్యం, 50 వేల కంటే ఎక్కువ నగదును తరలిస్తే ఎన్నికల నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంగిస్తే ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, జెడ్పీ సీఈఓ గోవింద్, డీఈవో రవీందర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

నగదు లావాదేవీలపై నిఘా ఉంచాలి

నిర్మల్‌చైన్‌గేట్: ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నగదు లావాదేవీలపై నిఘా ఉంచాలని జిల్లా ఎన్నికల అధికారి ఆశిష్ సంగ్వాన్ బ్యాంకు అధికారులకు సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల నిబంధనలు, అధిక మొత్తం నగదు లావాదేవీలపై బ్యాంకర్లతో సోమవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. రూ.50 వేలకన్నా ఎక్కువ మొత్తంలో లావాదేవీలు జరుపుతున్న ఖాతాలపై నిఘా ఉంచాలన్నారు. ప్రతీరోజు బ్యాంకుల వారీగా లావాదేవీల రిపోర్టులు ఇవ్వాలని సూచించారు. నామినేషన్ వేసే అభ్యర్థుల పేరిట నూతన ఖాతా తెరవాలని తెలిపారు. అనంతరం బ్యాంకు లావాదేవీలు, క్యూఆర్ కోడ్ వంటి అంశాలపై ఈడీఎం నదీమ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఎల్‌డీఎం చంద్రశేఖర్, వివిధ బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు హాఫ్ డే

- పని వేళల మార్పు
- ఉదయం 8 నుంచి 12.30 గంటల వరకు కేంద్రాల నిర్వహణ

ప్రాజెక్టు కేంద్రాలు	చిన్నారులు	గర్భిణులు/బాలింతలు	
నిర్మల్	297	21,946	4,298
ఖానాపూర్	244	13,106	2,246
భైంసా	205	12,928	2,722
ముథోల్	180	11,389	1,862
మొత్తం	926	59,369	11,128



భైంసాటౌన్: ప్రభుత్వ పాఠశాలల మాదిరి అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం హాఫ్ డే ప్రకటించింది. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రాల పనివేళలను మార్చింది. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకే కేంద్రాలు తెరిచి ఉంచాలని మహిళా, స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారులు ఐసీడీఎస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పాఠశాలలకు ఈనెల 15 నుంచి ఒంటిపూట ప్రారంభం కాగా, అంగన్వాడీలకు 16 నుంచి ఒంటిపూట నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే, సోమవారం హాఫ్ డే అమలు చేస్తున్నారు. మే 31 వరకు కేంద్రాలను ఒంటిపూట నిర్వహించనున్నారు. ఎండాకాలం ప్రారంభం కావడంతో రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. అంగన్‌వాడీలకు సొంత భవనాలు లేక ఇరుకైన గదుల్లో ఉక్కపోతతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. ఇదివరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కేంద్రాలు తెరిచి ఉంచేవారు. ప్రస్తుతం ఒంటిపూట కేంద్రాలు నిర్వహించనున్న నేపథ్యంలో మధ్యాహ్నం 12.30 గంటలలోపు చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందజేయాలని, మధ్యాహ్నం తరువాత టీచర్లు, ఆయాలు వార్షిక సర్వే, ప్రీస్కూల్ ప్రవేశాలకు విద్యార్థుల నమోదు, బడి మానేసిన పిల్లల వివరాలు సేకరించాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఒంటిపూటతో ఊరట..

వేసవి ప్రారంభంలో ఏటా పాఠశాలలకు ఒంటిపూట తరగతులు నిర్వహిస్తుంటారు. అలాగే విద్యా సంవత్సరం పూర్తి కాగానే వేసవి సెలవులు సైతం ఉంటాయి. అయితే, అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రం వేసవి సెలవులు ఉండవు. వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. జిల్లాలో చాలా వరకు కేంద్రాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. సరైన వసతులు లేక, కనీసం సరైన వెలుతురు, గాలి వసతి లేని కేంద్రాలు ఉన్నాయి. దీంతో ఎండాకాలంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకే కాకుండా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సైతం ఇబ్బంది పడుతుంటారు. ఈ నేపథ్యంలో ఒంటిపూట కేంద్రాల నిర్వహణ ఊరటనిచ్చే విషయమే.

ఆదేశాలు అందాయి...

అంగన్‌వాడీ కేంద్రాలు ఒంటిపూట నిర్వహించాలని ఆదేశాలు అందాయి. సోమవారం నుంచి మే 31 వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కేంద్రాలు నిర్వహిస్తాం. ఈ మేరకు టీచర్లకు ఆదేశాలిచ్చాం.

– శ్రీమతి, ఐసీడీఎస్ సీడీపీవో, భైంసా

‘పది’ పరీక్షలు ప్రారంభం

- తొలి రోజు 8,903 మంది విద్యార్థులు హాజరు
- పలు కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, డీఈవో



పరీక్ష రాసేందుకు వస్తున్న విద్యార్థులు

నిర్మల్ రూరల్: పదో తరగతి వార్షిక పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 47 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 8,923 మంది విద్యార్థులకు 8,903 మంది విద్యార్థులు తొలిరోజు పరీక్షకు హాజరయ్యారు. 20 మంది గైర్హాజరయ్యారు. నిమిషం నిబంధన లేకపోవడంతో ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన వారిని కూడా పరీక్షకు అనుమతించారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, డీఈవో రవీందర్‌రెడ్డి జిల్లా కేంద్రంలోని రామ్‌నగర్ బాలికల ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.



తనిఖీ చేసి కేంద్రంలోకి పంపుతున్న అధికారులు



జిల్లా కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, డీఈవో



హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

క్లుప్తంగా

గుడుంబా తయారు చేస్తే కఠిన చర్యలు



బెల్లం పానకం పారబోస్తున్న పోలీసులు

లక్ష్మణచాంద: గుడుంబా తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై శ్రీకాంత్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని పార్‌పెల్లి తాండలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బానోత్ రాజు ఇంట్లో 4 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేశారు. 100 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. తనిఖీల్లో ఏఎస్సై గంగాధర్, పీసీలు గణేశ్, భూమన్న, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు మట్కా నిర్వాహకుల అరెస్ట్




మాట్లాడుతున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

జైనథ్: మండలంలోని పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా సమీపంలో 44వ నంబరు జాతీయ రహదారిపై ఆరుగురు మట్కా నిర్వాహకులను అరెస్ట్ చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి తెలిపారు. సోమవారం జైనథ్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా సమీపంలో మహారాష్ట్ర వైపు వెళ్తున్న కొయ్యల రమణ, మేకల సత్యనారాయణ, లక్ష్మణ్, జమీర్, ప్రకాష్, అవినాష్‌ను తనిఖీ చేయగా వారి వద్ద మహారాష్ట్రలోని బోరి–పాటన్‌లో మట్కా నిర్వహిస్తున్న అశోక్ సామ్రాట్‌కు చెందిన పలు మట్కా చీటీలు, రూ.6,030 నగదు, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఒకటి కంటే ఎక్కువ సార్లు కేసులు నమోదయితే వారిపై పీడీయాక్ట్ కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీఐ డి.సాయినాథ్, ఎస్సై పురుషోత్తం పాల్గొన్నారు.

రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య

తలమడుగు: రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన పెందూరు సునీల్ (30) కొంతకాలంగా ఏపని చేయకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. దీంతో ఏదైనా పనిచూసుకొమ్మని తండ్రి భూమన్న మందలించాడు. దీంతో మనస్తాపం చెంది ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్ర వైపు వెళ్తున్న ప్యాసింజర్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు.

- ప్రేమ పెళ్లి వరకు వెళ్లడం లేదని మనస్తాపం..
- పెద్దలను ఒప్పించే ధైర్యం లేక తనువు చాలిస్తున్న వైనం..
- మూడు పదుల వయసులోపే ముగుస్తున్న జీవితాలు
- కన్నవారికి కడుపుకోత మిగులుస్తున్న బలవన్మరణాలు



ప్రేమిస్తే.. చావేనా?

నెన్నెల(బెల్లంపల్లి): ప్రేమ.. నేటి యువతకు పరిచయం అక్కర్లేని పదం. తెలిసీ తెలియని వయస్సులో ఆకర్షణో.. ప్రేమో అర్థం చేసుకోలేక ఆలోచించే పరిపక్వత లేక జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. క్షణికావేశంలో ప్రాణాలు తీసుకుంటూ కన్నవారికి కడుపు కోత మిగులుస్తున్నారు. ప్రేమ విషయం పెద్దలకు చెప్పుకోలేక , ప్రేమను ప్రియుడు, ప్రియురాలు నిరాకరించడంతో అఘాయిత్యాలకు ఒడిగడుతున్నారు. తల్లిదండ్రులు పిల్లలతో ఎక్కువ సమయం కేటాయించి వారిలో స్నేహభావం పెంపొందిస్తేనే ఇలాంటి సమస్యలకు పరిష్కార మార్గం దొరుకుతుందని మానసిక వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

సినిమాల ప్రభావంతో..

సినిమాల ప్రభావం నేటి యువతరం మీద ఎంతగానో పడుతోంది. ప్రేమ అనే అంశం లేకుండా సినిమాలు ఉండటం లేదు. వీటిని చూసిన యువత ప్రేమకు ఆకర్షితులవుతున్నారు. దీనికి తోడు సెల్‌ఫోన్‌లు ప్రేమికులను మరింత చేరువ చేస్తున్నాయి. చాటింగ్,వాట్సాఫ్‌కాల్,వీడియోకాల్‌తో ప్రేమికులు నిత్యం కలుసుకునేందుకు వీలుగాఉంటోంది. సోషల్ మీడియా ప్రభావం కూడా యువతపై పడుతోంది.

తల్లిదండ్రులు స్నేహితులుగా మెలగాలి

ప్రతీ మనిషికి స్నేహితుడి తోడు ఎంతో అవసరం. మంచి, చెడులను వివరించి చెప్పగలిగే స్నేహితుడు దొరికినట్లయితే వారు చాలా అదృష్టవంతులు. అమ్మానాన్నలు తమ పిల్లలను స్నేహితులుగా భావించాలి. వారికి కలిగే చిన్న చిన్న సమస్యలను మొదలుకొని ప్రేమ వ్యవహారాల్లో సైతం స్నేహితుడి పాత్ర పోషించాలి. పెద్దలకు తెలియకుండానే ఏమనుకుంటారనో, ఏమైనా చేస్తారోననే భయంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

మచ్చుకు కొన్ని ఘటనలు

- బెల్లంపల్లి పట్టణం షంషీర్‌నగర్‌కు చెందిన సోయం తేజశ్రీ నెన్నెల మండలం లంబాడితండాకు చెందిన దరావత్ రాజ్‌కుమార్ కొంతకాలంగా ప్రేమించుకున్నారు. ప్రియుడు పెళ్లికి నిరాకరించడంతో ఏంచేయాలో తోచక తేజశ్రీ అక్టోబర్ 6, 2022న పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది.
- కుశ్నపల్లికి చెందిన జాడి రవి, వేమనపల్లి మండలం బుయ్యారం గ్రామానికి చెందిన సత్యశ్రీ కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. సత్యశ్రీ అనారోగ్యానికి గురికావడంతో మృతి చెందింది. ప్రియురాలి లేని జీవితం వ్యర్థమని భావించిన రవి 2022 ఫిబ్రవరి 9న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.
- 2023 ఫిబ్రవరి 19న హాజీపూర్ మండలం దొనబండలో ఆర్థిక ఇబ్బందులతో శ్రీకాంత్ అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న ప్రియురాలు సంఘవి ప్రియుడు లేని లోకంలో నేనుండలేనని పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది.
- బెల్లంపల్లి పట్టణానికి చెందిన సాజిద్, యశ్వంతిక కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. వారి ప్రేమను పెద్దలు అంగీకరించకపోవడంతో 2021 అక్టోబర్ 23న జైపూర్ శివారులోని గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు.
- భీమిని మండలం మల్లీడి గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థిని దొబ్బల కల్పన, అదే గ్రామానికి చెందిన కోట మల్లేశ్ ప్రేమించుకున్నారు. మల్లేశ్ పెళ్లికి నిరాకరించడంతో మనస్తాపం చెందిన కల్పన 2021 డిసెంబర్ 26న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది.
- మందమర్రి మండలం మామిడిగట్టు గ్రామానికి చెందిన నాంపల్లి సంగీత, నెన్నెల మండలం చిత్తాపూర్‌కు చెందిన తీగుళ్ల భగవాన్ కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. భగవాన్‌తో పెళ్లికి నిరాకరించిన యువతి తల్లిదండ్రులు వేరే పెళ్లి సంబంధాలు చూస్తుండడంతో మనస్తాపం చెందింది. ఈ నెల 13న ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ప్రియురాలి మరణవార్త విన్న ప్రియుడు పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు.

తల్లిదండ్రులు, టీచర్లు గమనిస్తూ ఉండాలి



పిల్లల ప్రవర్తనను ఇంట్లో తల్లిదండ్రులు, బడిలో టీచర్లు గమనిస్తూ ఉండాలి. పిల్లలు తప్పు చేస్తే కొట్టడం, తిట్టడం చేయకుండా ఓపికతో మాట్లాడి నచ్చజెప్పాలి. చెడు మార్గం వైపు వెళ్లకుండా చూడాలి. ప్రేమికులు మొదట తల్లిదండ్రుల మనస్సు గెలుచుకోవాలి. ప్రేమించడంతో పాటు యోగ్యతను సంపాదించాలి. ఆర్థిక స్థిరత్వం ఉంటే తల్లిదండ్రులు ఒప్పుకునే వీలుంటుంది. అనుకున్నది జరగకపోతే తట్టుకునే శక్తి లేక యువత క్షణికావేశంలో ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. యువతకు భవిష్యత్‌లో లక్ష్యం లేకపోవడం కూడా ఒక కారణం.

– డాక్టర్ సునీల్‌కుమార్, మానసిక వైద్య నిపుణులు, మంచిర్యాల

చట్టాలను ఉపయోగించుకోవాలి



యువత చట్టాన్ని ఉపయోగించుకుని చట్టపరమైన హక్కులు సాధించుకోవాలి. పిరికితనంతో ఆత్మహత్యలకు పాల్పడవద్దు. ప్రస్తుత కాలంలో పిల్లలు ఆటలకు దూరం కావడం కూడా ఒక కారణం. ఆటలు ఆడటం ద్వారా గెలుపు, ఓటములను తట్టుకునే శక్తి ఉంటుంది. ముఖ్యంగా యువత సోషల్ మీడియా, స్మార్ట్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలి. సమస్యలు ఎదురైతే ఎలా పరిష్కరించుకోవాలో తెలుసుకోవాలి. బ్రతకడానికి ఎన్నో మార్గాలు, చావడానికి ఒకటే మార్గం. ధైర్యంగా ముందుకు నడవాలి.

– శ్యాంపటేల్, ఎస్సై, నీల్వాయి

పార్టీని పటిష్టం చేయాలి

- డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు



సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

నిర్మల్‌ఖిల్లా/చైన్‌గేట్: నిర్మల్ నియోజకవర్గంలో గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు నాయకులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని కేఎస్‌ఆర్ క్యాంపు కార్యాలయంలో నిర్మల్ నియోజకవర్గంలోని మండలాల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులతో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలను గ్రామాల్లో ఇంటింటికీ వివరించాలని సూచించారు. గ్రామ, మండల, పట్టణంలోని వార్డు కమిటీలను త్వరలో పూర్తి చేయాలన్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజలు ఎంతో సంతోషంగా ఉండాలన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని కోరారు.

క్రమశిక్షణతో ఆడి విజయం సాధించాలి



పరిచయం చేసుకుంటున్న గోవర్ధన్‌రెడ్డి

ఉట్నూర్‌రూరల్: జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున పాల్గొంటున్న క్రీడాకారులు క్రమశిక్షణతో ఆడి విజయం సాధించాలని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి సూచించారు. ఢిల్లీలో ఈ నెల 28న జరుగనున్న ఖోఖో పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఉట్నూర్‌లోని కొమురంభీం కాంప్లెక్స్‌లో సోమవారం ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి, ఏఎస్‌వో హేమంత్, కోచ్ శివకృష్ణ, ఆనంద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



విద్యార్థులతో మాట్లాడుతున్న పీవో ఖుష్బూగుప్తా

తాంసి: గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులతో పాటు సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. వసతిగృహం పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం, విద్యార్థులకు కనీస వసతులు లేకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మరుగుదొడ్లు సరిపోవడం లేదని, ఫ్యాన్లు,ఆర్వో ప్లాంట్ సైతం లేదని విద్యార్థులు పీవో దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం సిబ్బంది హాజరు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. కుక్ మహేందర్, వాచ్‌మెన్ విజయ్ స్థానంలో ఇతర వ్యక్తులు పనుల్లో ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా విధులకు గైర్హాజరైన వార్డెన్ స్వప్నను సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు. విజయ్, మహేందర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. పీవో వెంట ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం అరుణ, ఉపాధ్యాయులు గంగయ్య, ప్రభాకర్ ఉన్నారు.

‘గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి’



లోగో ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్/ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని తెలంగాణ స్టూడెంట్ ఫోరం (టీఎస్‌ఎఫ్) తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని యాదవ సంఘం భవనంలో సోమవారం టీఎస్‌ఎఫ్ లోగో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో విశ్వ విద్యాలయంతో ఆదివాసీ, గిరిజనులకు మేలు చేకూరుతుందన్నారు. కామన్ స్కూల్ విద్యావిధానం అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బండి దత్తాత్రి, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ నారాయణ, ఆదివాసీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్ నాయక్, ఏఐఎస్‌బీ రాష్ట్ర అధ్యక్షుడు జీవారే రాహుల్, జిల్లా అధ్యక్షుడు దాదేరావు, కార్యదర్శి అశోక్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి గణేశ్, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

లేతజొన్న తిని 34 గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలు

లోకేశ్వరం: లేత జొన్నకర్రలు తిని 34 గొర్రెలు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన రసూల్ యాదవ్, పిప్రి పోతన్న యాదవ్‌కు చెందిన గొర్రెలను ఆదివారం మేతకు తోలుకెళ్లారు. సాయంత్రం ఇంటికి తిరిగి వస్తుండగా అదే గ్రామానికి చెందిన ఓ రైతు చేనులో లేత జొన్నకర్రలను మేపారు. రాత్రి గొర్రెల కడుపులు ఉబ్బడంతో వెంటనే పశువైద్యులకు సమాచారం అందించారు. చికిత్స చేయించినా ఫలితం లేకుండా పోయింది. రసూల్‌కు చెందిన 19, పోతన్నకు చెందిన 15 గొర్రెలు మృతి చెందాయి. వాటి విలువ రూ.4లక్షల వరకు ఉంటుందని బాధితులు తెలిపారు. బాధిత కుటుంబాలను సోమవారం ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పరామర్శించారు. నష్ట పరిహారం కోసం ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ఆయన వెంట నాయకులు జయసాగర్‌రావు, మెండె శ్రీధర్, చిన్నారావు, రాజశేఖర్, సుమన్ కుమార్, సరస్వతి ఉన్నారు.

కుక్కల దాడిలో ఏడు గొర్రెలు మృతి

ముథోల్: కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మండల కేంద్రంలోని దనగరిగల్లీలో రైతు కోనేకర్ లక్ష్మణ్ ఆదివారం తమ గొర్రెలను మేతకోసం అడవికి తోలుకెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చి పశువుల పాకలో గొర్రెలను తోలి ఇంటికి వెళ్లిపోయాడు. రాత్రి సమయంలో పశువుల పాకలోకి కుక్కలు చొరబడి గొర్రెలపై దాడి చేశాయి. సోమవారం ఉదయం లక్ష్మణ్ వెళ్లే సరికి ఏడు గొర్రెలు మృతి చెంది ఉన్నాయి. మృతి చెందిన గొర్రెల విలువ రూ.70వేల వరకు ఉంటుందని బాధితుడు వాపోయాడు. నష్టపరిహారం అందించాలని అధికారులను వేడుకున్నాడు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య

తానూరు: ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకుని రైతు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. దౌలతాబాద్‌కు చెందిన రాజుల వెంకన్న (50)తన కున్న మూడెకరాల్లో ఏటా పంటలు సాగు చేయగా రెండేళ్లుగా భారీ వర్షాలు, వరదల కారణంగా దిగుబడి రాలేదు. ఏడాది క్రితం కొంతమేర అప్పులు చేసి కుమార్తె వివాహం చేశాడు. సాగు పెట్టుబడితో పాటు కుమార్తె వివాహానికి చేసిన అప్పు ఎలా తీర్చాలో తెలియక మనోవేదన చెందాడు. సోమవారం పంటచేనులో చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుని భార్య భోజాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

అకాల వర్షం.. అపార నష్టం

- 360 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు



ఎడ్లబండిపై విరిగిపడిన చెట్టు



బరంపూర్ శివారులో నెలకొరిగిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఎంపీటీసీ, గ్రామ పెద్దలు

తలమడుగు: మండలంలోని బరంపూర్, నందిగామ, పల్లి(బి), పల్లి(కే) గ్రామాల్లో సోమవారం సాయంత్రం కురిసిన వడగళ్ల వర్షానికి మొక్కజొన్న, వేరుశనగ, పొగాకు పంటలు నేలకొరిగాయి. బరంపూర్‌లో రైతు జక్కుల విట్టల్‌కు చెందిన ఎడ్లబండిపై చెట్టు విరిగిపడింది. మండలంలోని దాదాపు 200 ఎకరాల్లో మొక్కజొన్న, 80 ఎకరాల్లో జొన్న పంట, 50 ఎకరాల్లో వేరుశనగ పంట, 30 ఎకరాలలో పొగాకు పంటకు నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు. ఎంపీటీసీ రంజిత్, గ్రామ పెద్దలు కేదారేశ్వర్ రెడ్డి, మల్లేశ్ పంటలను పరిశీలించి వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు సర్వే నిర్వహించి నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

ప్రకృతితోనే మానవ మనుగడ



మస్కాపూర్‌లో మాట్లాడుతున్న వెంకటేశ్

ఖానాపూర్: భారతీయ జీవనవిధానం ప్రకృతితో ముడిపడి ఉందని, మానవ మనుగడకు ప్రకృతే ఆధారమని సామాజిక కార్యకర్త జక్కుల వెంకటేశ్ అన్నారు. మండలంలోని మస్కాపూర్ కేజీబీవీ విద్యార్థులకు ప్రకృతితో స్నేహం–పక్షులకు సహాయం కార్యక్రమంపై సోమవారం అవగాహన కల్పించారు. మానవులు చేసే కొన్ని తప్పిదాలతో ప్రకృతి అంతరించిపోతోందన్నారు. దీని ప్రభావం మానవ మనుగడపై చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా వాతావరణ కాలుష్యం, నీటి కాలుష్యం, శబ్ద కాలుష్యం, రేడియేషన్‌తో పక్షులు అంతరించిపోతున్నాయని తెలిపారు. వేసవిలో పక్షులకు, మూగజీవాలకు నీటి తొట్టిలు, బర్డ్ ఫీడర్లు, పక్షిగూళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

ఇంటికో ఎడ్లబండి.. నీళ్లకేనండి!





వేసవి ఆరంభంలోనే జిల్లాలో నీటి సమస్య మొదలైంది. ఏజెన్సీ ప్రాంతాల్లో తీవ్రంగా ఉంది. మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో గిరిజనులు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం సాలెగూడ వాసుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. గ్రామంలో ప్రతీ ఇంటి ముందు డ్రమ్ములతో కూడిన ఎడ్లబండే దర్శనమిస్తోంది. నీళ్లు కావాలంటే బండి కట్టాల్సిందేనని, రోజూ సుమారు రెండు కిలోమీటర్ల దూరంలోని పంట చేల వద్దకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి కోసం పనులు సైతం వదులుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

అంజీలో సామూహిక నిశ్చితార్థ వేడుకలు



ఇంద్రవెల్లి: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని అంజీ గ్రామంలో సోమవారం సామూహిక నిశ్చితార్థ వేడుకలు నిర్వహించారు. అంద్ ఆదివాసీ సంప్రదాయం ప్రకారం సంత్ సద్గురు పూలాజీబాబా ధ్యాన మందిరంలో ఆరు జంటలకు నిశ్చితార్థం నిర్వహించినట్లు వంశ పెద్దలు తెలిపారు. ఈ నెల 26న మండలంలోని దస్నాపూర్‌గూడలో వీరికి సామూహిక వివాహాలు నిశ్చయించినట్లు పేర్కొన్నారు. సద్గురు పూలాజీబాబా ఆశయసాధనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో అంద్ ఆదివాసీ ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాకురే రాందాస్, సంఘం జిల్లా అధ్యక్షుడు ముఖదే విష్ణు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఉత్తం, కుల పెద్దలు మారుతి, పుండలిక్, దశరథ్, తదితరులు పాల్గొన్నారు.